# వెచ్చని కన్నీరు

యర్రంశెట్టి శాయి

జీప్ చాలా వేగంగా నడుపుతున్నాడు డ్రైవర్.

అటూ యిటూ కొండలు. నీలిమ ఉత్సాహంగా చూస్తోంది రెండువైపులా!

ఇంకెంతో దూరంలేదు.

మహా అయితే అయిదారు మైళ్ళుంటుందేమో ఆ ఊరు. ఆ కొండలుదాటి కుడివైపునుండే మట్టిరోడ్డెక్కితే చాలు. పది నిముషాల ప్రయాణం, అంతే!

"నరసయ్యా" జీప్‌లోవెనకకూర్చున్న ప్యూన్‌ని పిలిచిందామె.

"అమ్మా!...."

"కొంచెం మంచినీళ్ళివ్వు...."

"అలాగేనమ్మా," కూజాలోనుంచి నీళ్ళు ఓ గ్లాసులోకి వంచి ఆమెకు అందించాడతను.

జీపు తారురోడ్డు దిగి కంకరరోడ్డు వేపు తిరిగింది. అంతా ఎర్రమట్టి. ఎటు చూచినా ఎర్రగా కనబడుతోంది.

నీలిమకు ఆనందం పొంగిపొరలింది.

ఈ రోడ్డు తనకి గుర్తుంది. చిన్నప్పుడు తామందరూ ఈ రోడ్డు చివరి వరకూ నడచివచ్చి ట్రంక్ రోడ్డుమీద పోయే కార్లు, లారీలు చూస్తూండేవాళ్ళు అప్పుడప్పుడూ.

అప్పటికీ, ఇప్పటికీ ఆరోడ్డు అలానే ఉంది. రోడ్డుప్రక్కన అక్కడక్కడ మామిడిచెట్లు ఇంకా అలాగే వున్నయ్.

మరికొద్ది నిమిషాల్లో ఊరిబయట వున్న మిలటరీ బారెక్స్ శిథిలాలు స్పష్టంగా కనిపించసాగినయ్. వాటిని చూస్తూనే పాతస్మృతులు ఒక్కసారిగా ఆమెని చుట్టుముట్టినయ్. ఇంగ్లీషువాళ్ళు పరిపాలించినప్పుడు వారి మిలిటరీ కోసం కట్టించిన కట్టడాలవి. అప్పటికే కప్పులు సగంకూలి ఉండేవి. ఇప్పుడు కేవలం మొండిగోడలుమాత్రం నిలబడిఉన్నయ్. అవికూడా శిథిలావస్థలో ఉన్నయ్.

తనూ శాంతా, కాత్యాయినీ, వల్లి, జనార్ధనం, రామకృష్ణ, కిషోర్-అందరూ

ప్రతిరోజూ సాయంత్ర సమయాల్లో అక్కడే ఆడుకునే వారు.

ఎంత సరదాగా ఉండేవా రోజులు? ఎంత మధురంగా, ఉండేవాక్షణాలు? జీప్ ఊళ్ళోకొచ్చేసింది.

వాళ్ళందరూ ఇప్పుడెక్కడున్నారో? ఏం చేస్తున్నారో? అందరినీ తనుఇంకా గుర్తుంచుకుంది. ఎన్నోసార్లు వాళ్ళతో గడిపిన ఆ అద్భుతమయిన రోజుల్ని పదే పదే తల్చుకొంది. మరొక్కసారయినా ఆ ఊరువెళ్ళి వారినీ, ఆ పరిసరాల్నీ చూడాలని తపించిపోయింది. ముఖ్యంగా రామకృష్ణ—ఆ ఊరు వదిలిన చాలా రోజుల వరకూ అతని గురించి దిగులుకూడా పెట్టుకుంది తను. అంతటి స్నేహం ఏర్పడిపోయింది అతనితో. తామందరికీ లీడర్‌లా వ్యవహరిస్తూండే వాడతను. అంతేకాకుండా....అంతే కాకుండా సడెన్ బ్రేకు వేయడంతో పెద్ద కుదుపుతో ఆగిపోయింది జీపు.

జీపుముందునుంచి ఓ కుర్రాడు తూనీగలా పరుగెత్తాడు.

నవ్వు వచ్చింది నీలిమకు.

ఓరోజు తామందరూ ఆడుకొనిఇంటికి వస్తోంటే అదేచోట తను సైకిలు కింద పడింది. దెబ్బలంత గట్టిగా తగల్లేదు కానీ భయంవల్ల గట్టిగా ఏడ్చేయసాగింది తను. అప్పుడు మిగతా వాళ్ళంతా ఎంతగా భయపడిపోయారు? తను బాధ పడుతూంటే చూసి రామకృష్ణ ఎంతగా విలవిల లాడిపోయాడని! ఆ రెండు రోజులూ తను ఆడుకోడానికి వెళ్ళలేక పోయిందని అతనూ మిగతావాళ్ళతో వెళ్ళకుండా తనతోపాటు తనింటి దగ్గరే ఉండిపోయాడు చీకటి పడేవరకూ!

బయట కొత్తగాకట్టిన హోటల్‌వేపు చూసింది నీలిమ. అదివరకు ఒకేఒక్క హోటల్ ఉండేది. అప్పుడప్పుడు తాము అందులోనే స్వీట్స్ కొనుక్కునేవాళ్ళు. అదివరకు అసలు రిక్షాలే ఉండేవికాదు. అన్నీ గుర్రపు బండ్లే! యిప్పుడు సెంటర్‌దగ్గర ఓ రిక్షాస్టాండు వెలిసింది. ఆ రోజుల్ని గుర్తుకు తేవడానికన్నట్లు రెండుమూడు గుర్రపుబండ్లుకూడా మిగిలి వున్నయ్.

జీప్ రోడ్డు పక్కనేవున్న ఆవరణలోకి వెళ్ళి ఆగిపోయింది. ప్రభుత్వ ట్రావెలర్స్ బంగళా అది. నీలిమ జీప్ దిగి నిలబడగానే బంగళా వాచ్‌మన్ పరుగుతో వచ్చాడు.

బంగళాలోకి నడిచి కుర్చీలో కూలబడిందామె. చాలా చల్లగాఉంది లోపల. ఓ పక్కగా ముచ్చటగా ఉన్న డెకొలాన్ మంచం, పరుపూ, దుప్పటీ అన్నీ అమర్చబడి ఉన్నాయ్.

కాస్సేపు విశ్రాంతి తీసుకుంటేగాని తను మళ్ళీ మామూలు మనిషవలేదు అనుకొంది నీలిమ.

ఫ్యాన్ ఓ పెద్ద టిఫిన్ కారియర్ తెచ్చి టేబుల్ మీదుంచాడు.



"ఇన్‌స్పెక్టర్‌గారు పంపించారమ్మా!" అన్నాడు ఆమెతో.

"ఎందుకు? హోటల్‌నుంచి తెప్పించుకొనేవాళ్ళంకదా!" చిరాకుగా అందామె.

ఏం మాట్లాడాలో తెలియక నెత్తి గోక్కుంటూ ఊరుకుండి పోయాడతను.

"సరే! రాత్రికి హోటల్‌నుంచే తెప్పించుకుంటామని కబురుచెయ్యి."

"అలాగేనమ్మా!" వెళ్ళిపోయాడతను.

"వేణ్ణీళ్ళు సిద్ధంచేశానమ్మా...." వాచ్‌మన్ వచ్చాడక్కడికి.

"సరే!" లేచి టవలూ, బట్టలూ తీసుకొని బాత్‌రూమ్‌లోకి నడిచిందామె.

ఆమె మనసంతా ఏదో తెలీని ఆనందంతో నిండిపోయింది.

ఎంత త్వరగా సాయంత్రమవుతుందా, ఎంత త్వరగా తన బాల్యస్నేహితుల గురించి తెలుసుకుందామా, ఎంత త్వరగా రామకృష్ణని కలుసుకొందామా అన్న ఆతృత ఎక్కువయిపోతోంది.

భోజనం ముగించేసరికల్లా ఇన్‌స్పెక్టర్, కరణం, మునసబు అందరూ వచ్చేసారక్కడికి. సాయంత్రం అయిదింటి వరకూ ఇన్‌స్పెక్షన్‌తోనే గడిచిపోయింది. ఆరు గంటలకల్లా అందరూ వెళ్ళిపోయారు.

తను త్వరత్వరగా ముస్తాబయింది

నీలిమ. అప్పటికే ఎండ పూర్తిగా హరించుకు పోయింది.

"నేనలా ఊళ్ళోకెళ్ళి వస్తాను...." అని ఫ్యాన్‌కి చెప్పేసి రోడ్డుమీదికొచ్చిందామె. ఆ రోడ్డు కొంచెం హడావుడిగానే ఉంది. రెండు బస్సులు రోడ్డు పక్కనే ఆగివున్నయ్.... వాటిచుట్టూ అరటిపళ్ళు, సోడాలమ్మేవాళ్ళు మూగి గట్టిగా అరుస్తూ అమ్ముతున్నారు.

ఉండుండి ఓ రిక్షా బిగ్గరగా గంట కొడుతూ వెళ్తోంది

ఓ మూలగా ఉన్న సినిమాహాల్లోంచి పాత సినిమా రికార్డులు కర్ణకఠోరంగా వినబడుతున్నయ్.

త్వరత్వరగా అడుగులువేస్తూ మెయిన్‌రోడ్డునుంచీ ఊళ్ళోకున్న సందులోకి తిరిగిందామె. మొదట్లోనే ఉన్న పెంకుటింటిని చూస్తూనే ఉలిక్కిపడింది. అదివరలో ఎంతో పెద్ద పెంకుటిల్లది—సగానికిపైగా కూలిపోయింది. కాత్యాయిని వాళ్ళయిల్లు. ఎండాకాలంలో చిట్ట మధ్యాహ్నంవేళ ఆ ఇంటి వెనుకవున్న మామిడితోటలో చేరేవాళ్ళు తామందరూ. అక్కడవున్న అవుట్ హౌస్‌లో లక్కపిడతలతో ఆటలాడుకొనేవాళ్ళు. సాధారణంగా ఆ ఆటలో తనూ, రామకృష్ణే మొగుడూ పెళ్ళాలు. నవ్వు వచ్చింది నీలిమకు.

పెంకుటింటి దగ్గరగా నడిచి గడప బయట నిలబడి లోపలకు తొంగిచూసింది. లోపల అలికిడే లేదు.

"ఏవండీ!" నెమ్మదిగా పిలిచిందామె. జవాబు రాలేదు.

మరి రెండుసార్లు గట్టిగా పిలిచినా జవాబు రాకపోయేసరికి, ఇంటిపక్కనుంచి పెరటివేపు నడిచిందామె. అక్కడ నూతి గట్టుమీద కూర్చుని ఏవోగిన్నెలు కడుగుతోంది ఓ ముసలామె. ఆమెను చూస్తూనే గుర్తించింది నీలిమ. ఆమె కాత్యాయిని తల్లి.

"ఏవండీ!" ఆనందంగా పిలిచింది నీలిమ.

ఆమె తలెత్తి నీలిమవేపు చూసి, గుర్తించలేక "ఎవరు?" అంటూ దగ్గరకు వచ్చింది.

"నేనండీ! నీలిమను. సీతమ్మ కూతురిని. నా చిన్నప్పుడు వెంకట్రామయ్యగారిడాబాలోఅద్దెకుండేవాళ్ళం...." ఆశగా అంది నీలిమ.


"ఓహో....ఇప్పుడెక్కడుంటున్నారు?" అడిగిందామె గుర్తుకు తెచ్చుకోడానికి ప్రయత్నిస్తూ.

"మా వాళ్ళంతా హైద్రాబాద్‌లోనే వుంటున్నారు. నేను వైజాగ్‌కి ట్రాన్స్‌ఫరై వచ్చానీమధ్యే."

"రా, లోపలకూర్చుందూ గాని...." ఆహ్వానిస్తూ అందామె.

"కాత్యాయిని ఎక్కడుందిప్పుడు?" ఆమె వెనుకే లోపలకు నడుస్తూ అడిగింది నీలిమ.

"కాకినాడలో! వాళ్ళత్తగారిల్లు అక్కడే!"




"మీ ఆయనేం చేస్తున్నాడు?" అడిగిందామె.

నీలిమ సిగ్గుపడింది.

"ఇంకా పెళ్ళికాలేదు నాకు...." బిడియంగా జవాబిచ్చింది.

"అలాగా!" ఆశ్చర్యంగా అందామె. "కాత్యాయిని తరువాత అమ్మాయి మాధవికికూడా పెళ్ళయిపోయింది కిందటేడు...."

"కాత్యాయినికి పిల్లలా?" అడిగింది నీలిమ.

"ఇద్దరు! ఇద్దరూ ఆడపిల్లలే! దానికదే దిగులు...."

మరికొద్దిసేపు కూర్చుని శెలవు తీసుకొని బయటి కొచ్చిందామె.

కాత్యాయిని తల్లివల్ల మరికొన్ని వివరాలు కూడా తెలిసినయ్ నీలిమకు.

శాంతకూడా వివాహమయి భర్తతో భిలాయ్ వెళ్ళిపోయిందిట.

వల్లి శ్రీకాకుళంలో కాపురం! జనార్ధనం అదే ఇంట్లోఉండి వ్యవసాయం చూసుకొంటున్నాడట. కిషోర్ వైజాగ్‌లోనే ఉంటున్నాడట. రామకృష్ణ శివాలయం వెనుకవీధిలో ఓ ఇంట్లో ఉంటున్నాడట.


ఆ వార్త పోయిన ఉత్సాహాన్ని తిరిగి తీసుకొచ్చింది నీలిమలో.

అప్పటికే మసకచీకట్లు వ్యాపిస్తున్నయ్. వడివడిగా శివాలయంవేపు నడువసాగిందామె. ఇళ్ళల్లోనుంచి తన వేపు అందరూ వింతగా చూస్తున్నారు. హిందీమాష్టరుగారింటి వెనుక పెద్ద పెద్ద గడ్డివాములు అదే స్థలంలో ఉన్నయ్. ఎప్పుడూ అక్కడే వామి

వేస్తూంటారు. కాత్యాయినివాళ్ళింటి వెనుక ఉన్న మామిడి తోటలో ఓ కాపలావాడిని పెట్టారు, తోటగలవాళ్ళు. అందుకని ఆ తరువాత తామందరూ ఆ గడ్డివాముల్లో ఆడుకొనేవారు. వాటి చుట్టూ ఉన్న చింతచెట్లు చక్కని నీడ కూడా ఇచ్చేవి. హఠాత్తుగా ఆ గడ్డివామి దగ్గర జరిగిన ఓ సంఘటన గుర్తుకొచ్చి వొళ్ళు గగుర్పొడిచిందామెకి. ఆ రోజు మధ్యాహ్నం అందరూ అక్కడకు చేరి దాగుడుమూత లాడటం మొదలుపెట్టారు. తను పరుగుతో ఎవరికంటా పడకుండా చివరగా ఉన్న గడ్డివాములో కెళ్ళి లోపలకు దూరి కూర్చుని, తను కనబడ కుండా పైన గడ్డి వేసుకొంది. రెండు నిమిషాల తర్వాత రామకృష్ణ కూడా అక్కడికే వచ్చాడు దాక్కోడానికి.

"ఏయ్....త్వరగా దూరిక్కడ— కిషోర్ వచ్చేస్తాడు" అంది తను పైనున్న గడ్డి తొలగిస్తూ. వెంటనే రామకృష్ణ కూడా తన పక్కకొచ్చి కూర్చుని మళ్ళీమీదకు గడ్డి లాగేశాడు. లోపల ఉక్కపోస్తోంది. వాళ్ళంతా దురదలు. వెనక్కు జరగబోయి చటుక్కున అతనిమీదకు పడిపోయింది తను. తనతోపాటు అతనూ వెనక్కు పడిపోయాడు. సరిగ్గా అప్పుడే కిషోర్ అడుగుల చప్పుడు వినబడడంతో కదల కుండా అలానే ఉండిపోవాల్సి వచ్చింది చాలాసేపు. అంతవరకూ ఎప్పుడూ కలుగని ఓ విధమయిన జలదరింపు కలుగజేసిందతని స్పర్శ. సరిగ్గా అప్పుడే అతనిలో కూడా సంచలనం కలిగినట్లయింది. గట్టిగా తనను అతనికేసి హత్తుకొని పెదాలమీద ముద్దు పెట్టుకొన్నాడు. తనకెందుకో భయం వేసింది. ఒక్క ఉదుటన అక్కడినుంచి లేచి బయటపడి పరుగుతో ఇంటికి చేరుకుంది.

ఆ రోజునుంచీ కొద్దిరోజులపాటు అతనితో అదివరలా చనువుగా ఉండటం మానేసింది.కానీ రానురాను మళ్ళీఅతనితో అదివరలా కలసి తిరగాలన్న కోరిక ప్రబలిపోయింది. అతనూ తనతో మాట్లాడడంకోసం తపించిపోసాగాడు. ఇద్దరిమధ్యా కొత్త చనువు, కొత్త పరిచయం ప్రబలబోతున్న సమయంలో తామా ఊరు వదిలేయాల్సి వచ్చింది. కొత్త ఊరు చేరుకొని ఎంతకాలమయినా ఆ సంఘటననూ, అతనినీ మర్చిపోలేక పోయింది తను. మనసులో అదో చెరగని ముద్ర వేసేసింది. కాలక్రమేణా ఆ మధురస్మృతి మనసు అట్టడుగున పడిపోయింది. కాని సినిమాల్లో ప్రేయసీ ప్రియుల కౌగిలింతలు చూసినా, మరే ప్రేమికుల జంట రోడ్డుమీద పరవశత్వంతో మాట్లాడుకొంటూ కనిపించినా, ఆనాటి సంఘటన చటుక్కున పైకి వచ్చి హృదయాన్ని తీయని అనుభూతితో నింపేసేది.



రామకృష్ణ ఇప్పుడెలా ఉన్నాడో చూడాలన్న కోరిక దహించివేసేది. అతి కష్టంమీద ఇన్నాళ్ళూ ఆ కోరికను అణచుకొంటూ వచ్చింది. అనుకోకుండా ఇప్పుడు తనకి వైజాగ్‌లో ఉద్యోగం దొరకడం, కావాలని తను ఇక్కడికే కాంప్ వేసుకొని రావడం— జరిగిపోయింది.

శివాలయం వెనుక వీధిలో కొచ్చేసింది నీలిమ.

ఆలయం బయట అరుగుమీద కూర్చున్న ఓ ముసలాయన దగ్గరకెళ్ళి "రామకృష్ణఇల్లెక్కడ?" అనడిగిందామె.

"అదిగో! ఆడాబా ఇల్లే ...." చూపుతూ అన్నాడతను.

అటువేపు నెమ్మదిగా అడుగులు వేయసాగింది నీలిమ.

ఇంటి బయట ఆవరణలో ఆడుకొంటున్న పిల్లలు కనిపించారామెకి.

"మీది ఈ ఇల్లేనా?" అయిదేళ్ళ పాపను పిలిచి అడిగింది నీలిమ.

"అవును."

"మీ నాన్నగారి పేరేమిటి?"

"రామకృష్ణ."

ఓసారి గుండెలు వేగంగా కొట్టుకున్నాయ్ నీలిమకు.

రామకృష్ణకు అప్పుడే ఆరేళ్ళ పిల్లా?

"మీ నాన్న ఉన్నారా ఇంట్లో?" తిరిగి అడిగిందామె.

"ఉన్నారు.... పిలుస్తానుండు ...." అనేసి లోపలకు పరుగెత్తిందా పిల్ల.

నీలిమ కంగారుపడిపోయింది.

మరికొద్ది క్షణాల్లో రామకృష్ణవస్తాడు. బహుశా లుంగీ కట్టుకొని, బనీను వేసుకొని, కళ్ళజోడు పెట్టుకొని- అంతవరకూ తన కళ్ళల్లో నిలబడిన ఆనాటి రూపాన్ని చెరిపివేస్తూ- అతను తనని గుర్తించగలడా? ఊహూ. తను చెప్తేగాని సాధ్యంకాని విషయం అది. అతను తన నీపాటికి మర్చిపోయి ఉండవచ్చు. లేదా గుర్తున్నా ఆనాటి ఆ స్మృతులు అతని మనసునుండి తొలగిపోయి ఉండవచ్చు. ఇద్దరూ కలుసుకొంటారు. కాసేపు మాట్లాడుకొంటారు. తను తిరిగి అక్కడినుంచి బంగళాకు వచ్చేస్తుంది. అంతే అక్కడితో తన కానాటి అనుభూతి శాశ్వతంగా దూరమయిపోతుంది. ఆ క్షణంనుంచీ తను ఆనాటి సంఘటనను మరచిపోతుంది. రామకృష్ణ అనగానే ఈ రోజు తను చూడబోయే అతని రూపం కనబడుతుందిగాని ఆనాటి అనుభూతి ఉండదు

ఛటుక్కున వెనక్కి తిరిగి వడివడిగా అక్కడినుంచి బంగళావేపు నడిచింది నీలిమ.

అవును. తనలో ఆ అనుభూతి అలాగే నిలిచిపోవాలి.

అతనికి తారసపడి, కొద్ది క్షణాలు మాట్లాడి దానిని దూరంచేసుకోవడం తన కిష్టంలేదు.

బంగళా చేరుకొనేవరకూ వెనక్కి తిరిగి చూడలేదు నీలిమ.

లోపల మంచంమీద వాలిపోయి సంతృప్తిగా నిట్టూర్చిందామె.

కళ్ళల్లో నిలచిన రెండు కన్నీటి బిందువులను ఆనందంగా తుడిచేసుకుంది. ఆ కన్నీరు వెచ్చగా ఉంది.

